# ఇదే లేకపోతే!

## గంటి రమాదేవి

**ఫాన్సీ షాపు** పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్న నాకు అంత అదృష్టం కలుగుతుం దనుకోలేదు.

కొత్త సిగరెట్ మార్కెట్‌లోకి వచ్చింది. పేరు గమ్మత్తయినది-'లంగ్ పోకర్'. ముందు నేను కాల్చి చూశాను. పొగాకులో సుగంధ పరిమళాల వాసన-కొత్తగా ఉంది. మాటల సందర్భంలో కస్టమర్లతో లంగ్ పోకర్ బాగుందనీ, నేను కాల్చానని చెప్పాను. లంగ్ పోకర్ అమ్మకాలు నేను అనుకున్న దానికన్న ఎక్కువగానే అయ్యాయి.

ఆరునెలలు గడిచిన తర్వాత సిగరెట్టు కంపెనీ రీజినల్ డిస్ట్రిబ్యూటర్ నన్ను అభినందించేవరకు లంగ్ పోకర్ ఎక్కువగా అమ్మింది నేనే అని తెలియలేదు.

ఎక్కువగా లంగ్ పోకర్ అమ్మిన వాళ్ళకు ప్రోత్సాహక బహుమతిగా విదేశీ యానం ఉందిట. అన్ని ఖర్చులతో శ్రీలంకలో ఏడు రోజులుంటావా, సింగపూరులో మూడురోజులుంటావా, లేదా సిడ్నీ వరకు విమానం ఖర్చులు మేమిస్తాం-మిగిలిన ఖర్చులు పెట్టుకుంటావా అని అడిగినప్పుడు ఆలోచించాను.

శ్రీలంక, సింగపూర్ కన్న ఆస్ట్రేలియా వెళ్ళడం మంచిదనిపించింది. నా పెళ్ళయి ఏడాది పూర్తవలేదు. సులోచనకు పెళ్ళిరోజు బహుమతిగా సిడ్నీ యాత్ర కమ్ హనీ మూన్ సిడ్నీ వెడతామని చెప్పాను.

×× ×× ××

ఏర్పాట్లన్నీ పూర్తిచేసుకుని, విదేశీ మారకద్రవ్యం కోసం బాంకుకు వెళ్ళాను. మనిషికి అయిదు వందల అమెరికన్ డాలర్‌లు. ఇద్దరికీ కలిసి వెయ్యి. పదకొండు వేల రూపాయలు చెల్లించి డాలర్లు తీసుకున్నాను. సిడ్నీలో వారం ఉండ దలచుకున్నాను. ప్రయాణం ఖర్చులు సిగరెట్ కంపెనీ భరిస్తుంది కదా! పదకొండు వేలు వారానికి...ఓహ్! రాజాలా ఉండొచ్చు అనుకున్నాను.

సిగరెట్ కంపెనీ ఇచ్చిన ఈ అవకాశం, ఆ సిగరెట్ వల్లే దుస్వప్నంలా మారుతుందని నే నప్పు డనుకోలేదు...

×× ×× ××

మద్రాసునుండి తొమ్మిదిన్నరకు బయలుదేరింది ఎయిర్ ఇండియా విమానం. బంగాళాఖాతం మీద ముప్ఫయి అయిదు వేల అడుగుల ఎత్తున ఎగురుతూ మూడున్నర గంటల ప్రయాణంచేసి కౌలాలంపూర్ చేరింది. గంట ఆగిన తర్వాత మళ్ళీ బయలుదేరి, ఇంకో గంట ప్రయాణం తర్వాత సింగపూర్ చేరింది. నాలుగున్నర గంటల ప్రయాణం తర్వాత సింగపూర్ చేరినా, తూర్పుకు వెడుతూ ఉండడంవల్ల సాయంత్రం అయిపోయింది.

అక్కడనుండి పెర్తు నగరం, తర్వాత సిడ్నీ.

పసిఫిక్ మహాసముద్రంలో తూర్పు కోస్తాలో ఉన్న సిడ్నీ చేరుకునే సరికి బాగా అలసిపోయాం- నేనూ, సులోచనా. విమానంలో తిండికి లోటులేదు. కోకా కోలా డ్రింకు పిచ్చిగా త్రాగాం!

తెలతెలవారుతూ ఉండగా సిడ్నీలో దిగాం. ట్యూబ్ మార్గం గుండా విమానంలో నుండి నరాసరి ఎయిర్ పోర్టులోకి వెళ్ళాం.

సామాను తీసుకుని బయటకు వచ్చాం. ఒపేరా హౌస్ దగ్గర హోటల్ తీసుకోమని సలహా ఇచ్చాడు ట్రావెల్ ఏజంటు.

ఎయిర్ పోర్టు నుండి ఓరియార్డన్ రోడ్డు గుండా ఎలిజబెత్ వంతెన దాటి సిడ్నీ హార్బర్ దగ్గరనుంచి మళ్ళీ ఒపేరా హౌస్ దగ్గర దిగాం. టాక్సీ ఫేర్ విని గుండె గుభేలుమంది.

ఏభై డాలర్లు!

దాదాపు అయిదు వందల ఏభై రూపాయలు!

హయాడ్ కింగ్స్ గేట్ హోటలు, మర్క్యూ షెర్టాన్, షిర్టాన్ మోటార్ హోటల్, హిల్టన్ టౌన్ హౌస్ మోటాల్-ట్రావెల్ ఏజంట్ చెప్పిన హోటళ్ళు.

టాక్సీ దిగుతూ, రోజుకి ఎంతవుతుందని అడిగాను ఇంగ్లీషులో. ఇంగ్లీషు వచ్చిన వాడిలా ఉన్నాడు. చెప్పాడు. రోజుకు నాలుగు వందల డాలర్లు! టాక్సీ వెళ్ళిపోకుండా ఆపి అన్నింటికన్న చౌక హోటలుకు తీసుకు పొమ్మన్నాం.

జాక్‌సన్ ఇన్ దగ్గర దింపాడు. ఇంకో ఇరవై డాలర్లు తీసుకున్నాడు. జాక్‌సన్ ఇన్ డార్మిటరీ-మంచాలు హాలులో వేశాడు. రోజుకు నూట పది డాలర్లు. గది అయితే రెండు వందల యాభై.

ఒక మంచం చాలు అన్నాం. సులోచనను, నన్ను వింతగా చూసి భుజాలు ఎగరవేశాడు జాక్‌సన్ ఇన్ మేనేజర్!

జాక్‌సన్ ఇన్‌లో భోజన సదుపాయం లేదు. ఇంకో హోటలుకు వెళ్ళవలసిందే. భోజనం చేసిన తర్వాత సిడ్నీ అంతా తిరిగి, ఆ దేశంలో ముఖ్యమైన పట్టణాలు తిరగాలని మాప్లాను. వాకబు చేశాను సిడ్నీ చూడ్డానికి అయ్యే ఖర్చు. టాక్సీ అయితే అయిదు వందల డాలర్లు, బస్సయితే వంద డాలర్లు!

ఆస్ట్రేలియాలో మిగిలిన పట్నాలు చూడాలన్న మా కోరికను విరమించుకున్నాం.

మధ్యాహ్నం భోజనానికి బయలుదేరాం. మాంసం, చేపలు, గుడ్లు శుభ్రంగా నొక్కేస్తాను నేను. సులోచన గుడ్లు తింటుంది. పెళ్ళికోసం ఉపవాసాలు, పూజలు చేసి చేసి మాంసాహారం మానేసింది. పెళ్ళయిన తర్వాత అలవాటు చేశాను మెల్లిగా. ఇప్పుడు చికెన్ తింటోంది చాలు...పులిహోర, దద్ధోజనం అనకుండా!

అద్దాల తలుపులు తోసుకుని భోజన హోటలుకు వచ్చాం. హోటల్ పేరు ఆస్ట్రేలియా ఎక్స్‌ప్లోరర్. మెను కార్డు చూసి మతిపోయింది. మటన్ లేదు, చికెన్ లేదు, గుడ్డు అంతకన్నా లేదు.

హిప్పో పొటమస్ లెగ్స్ (నీటి గుర్రపు కాళ్ళు)

టైగర్ మీట్ (పులి మాంసం)

బేర్ కర్రీ (ఎలుగుబంటి కూర)

కాక్రోచ్ సూప్ (బొద్దింకల పులుసు)

ఫ్రాగ్ లెగ్స్ (కప్ప కాళ్ళు)

బటర్ ఫ్లైస్ (సీతాకోక చిలుకలు-బ్రతికినవో, చచ్చినవో!)

టెర్మయిడ్ మిక్స్ (చెద పురుగుల మిక్స్)

స్నేక్ పికిల్ (పాముల వూరగాయ)


ఇలా చదువుకుంటూ పోతోంటే పరిచయమైన వంటకం ఏదీ కనపడలేదు. చివరలో డాగ్ మీట్స్ (కుక్క మాంసంతో వంటలు) చూసి విస్తుపోతూ కార్డు తిప్పాను.


సీ ఫుడ్స్ (సముద్రపు ఆహారం)లో ఫిష్ (చేప) అన్న పదం ఉన్నది చూసి అది కావాలన్నాను-లేకపోతే ఏ తిమింగలాన్నో, మొసలి పిల్లనో తెచ్చి ప్లేటులో పెడతాడన్న భయంతో!

ప్లేటులో రెండు ముక్కలు తెచ్చి ముందు పెట్టాడు. యధాలావంగా ధర చూశాను. ఇరవై అయిదు అమెరిక్ డాలర్లకు సమానం ఆ ధర.

ఒకే పట్టులో ఆ నాలుగు తిన్నాను. మురిగిన మాంసం ముక్కల్లా వాసన...అదోరకం రుచి. సులోచన చేప తినదు...అదృష్టవంతురాలు. ఇంకో క్షణం అక్కడ ఉండలేదు. బిల్లు చెల్లించి బయటకు వచ్చాము.

నడుచుకుంటూ అలెగ్జాండర్ కాలువ దగ్గరకు వచ్చాం. బాగా ఆకలిగా ఉంది. దుకాణాలలో అనాస, ఆపిలు, అరటి, బొప్పాయి పళ్ళు అమర్చి ఉన్నాయి. డజను అరటి పళ్ళు కొనుక్కుని కాలక్షేపం చేసెయ్యొచ్చు





ఈ రోజుకు అనుకుని అరటి పళ్ళు ఎంత అని అడిగాను. డజను ఇరవై నాలుగు డాలర్లు. ఒక్కో అరటిపండు ఇరవై ఒక్క రూపాయి. గుడ్లు మీదికొచ్చాయి ఆ రేటు చూసి. మూడు అరటిపళ్ళు కొని సులోచనకిచ్చాను.

అరటిపళ్ళు తిని తొక్కలు పడేస్తుంటే ఉసూరుమంది ప్రాణం. అరటి పండు తొక్క ఒక్కొక్కటి నాలుగు రూపాయలు ఉంటుందా!

అప్పుడే వింత కోరికొకటి పుట్టింది...డస్ట్ బిన్‌లో పడ్డ ఆ తొక్కల దుమ్ము ఊది తినాలని!


బసకు వచ్చి నా దగ్గరున్న డబ్బు లెక్క చూసుకున్నాను. ఎట్టి పరిస్థితులలోను ఇక్కడ మూడురోజులకన్న ఎక్కువ ఉండడం అసాధ్యం అనిపిస్తోంది.

ఇక్కడి నుండి ఎంత తొందరగా బయట పడితే అంత మంచిది.

విమానయాన సంస్థకు టెలిఫోను చేసి తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోవాలి. వచ్చి ఇంకా ఇరవై నాలుగు గంటలు కాలేదు... అప్పుడే తిరుగు ప్రయాణం. శ్రీలంకకో, సింగపూరుకో వెళ్ళినా బాగుండేది.

టెలిఫోను చేయబోయి ఆగిపోయాను. వెధవ సంకటం...టెలిఫోనుకు ఏ పది డాలర్లో






తీసుకుంటే? టెలిఫోను చెయడానికి ఎంత అని అడిగాను. నా కంగారు చూసి వింతగా ఉన్నట్టుంది జాక్సన్ ఇన్ మేనేజర్ గాడికి ...అదో రకంగా నవ్వాడు. తల తీసేసినట్టయింది. వెధవకి వేళాకోళంలా ఉంది. ఒరే! ఇండియా రా రా... అప్పుడు చెప్తా నీ పని అనుకున్నాను.

"టెలిఫోన్ ఫ్రీ" అన్నాడు వాడు.

ఆస్ట్రేలియా ఎక్స్‌ప్లోరర్ హోటలుకు వెళ్ళి రాత్రి భోజనం చేద్దామా అనిపించి, పొద్దున్న జరిగిన అనుభవంతో ఆ ఆలోచన మానుకున్నాను. నీటి గుఱ్ఱం...పులి, ఎలుగు బంటి మాంసం, పాము ఊరగాయ కాకుండా ఈ సారి మనిషి మాంసం పెడతా నంటాడేమే!

పన్నెండు డాలర్లు ఇచ్చి అరడజను అరటి పళ్ళు కొని, నేను నాలుగు తిన్నాను. సులోచన రెండింటితో సరిపెట్టుకుంది. నీరసం ఆమె ముఖంలో కొట్టొచ్చినట్టు కనుపిస్తోంది.

ఇంకో రెండురోజులు.

నాలుగు వందలతో ఊరంతా తిరగడం! ఇంకో రోజు ముక్కు మూసుకుని గడిపి, మూడోరోజు విమానం ఎక్కడం... మద్రాసులో దిగిన వెంటనే పంచి ఆంధ్రా హోటలుకు వెళ్ళి పెరుగు, ఆవకాయలతో భోజనం చెయ్యా లని అనుకున్నాను.

డన్‌హిల్, కేమెల్, మెల్‌బోర్న్, ఆస్ట్రేలియా కింగ్స్ సిగరెట్లు పేర్చి ఉన్నాయి. నేను తెచ్చుకున్న లంగ్ పోకర్ అయిపోయాయి. డన్‌హిల్ ఒకటి కొని వెలిగించి దమ్ము తీశాను.

తేలిగ్గా ఉంది ప్రాణం.

రోడ్డు దాటి జాక్సన్ ఇన్ వైపు నడుస్తున్నా,

నాలుగు దమ్ములు లాగి సిగరెట్టు రోడ్డు మీద పడేశాను.

నా భుజం మీద బరువుగా చెయ్యి పడింది.

తలెత్తి చూశాను. నాకు రెండింతలు ఉన్నాడు. నేను వాడి ముందు పిట్టలా ఉన్నాను. వాడి చేతిలో నా భుజం నలిగిపోతూ ఉంది. ఏమిటన్నట్టు చూశాను.

నేను పారేసిన సిగరెట్టు చూపిస్తూ ఏదో అరుస్తున్నాడు. వాడి భాషేమిటో నాకు అంతు పట్టలేదు. ఇంగ్లీషు కాదు.

కడుపులో ఆకలి నకనకలాడుతూ ఉంది. నీరసంగా ఉంది. మా దారిన పోతూ ఉంటే వీడి దౌర్జన్యం ఏమిటి? నాకు ఒళ్ళు తెలియ లేదు.

"నీ ముఖం మండ! ఎందుకురా అంతల్లా పట్టుకుంటావ్! నీ కిదేం పొయ్యేకాలం. మేం ఏం చేశామని... నీ మంద్రకప్ప ముఖం, నువ్వూ..." తెలుగులోనే తిట్టుతున్నాను. పుట్టుకతో వచ్చిన భాష. అసంకల్పితంగా ప్రవాహంలా వస్తూవుంది. నా మాటలో ఒకటి రెండు అనరాని మాటలు దొర్లినట్టున్నాయి. సులోచన నోరు తెరచి చూస్తూవుంది. నా ఒళ్ళు నాకు తెలియడం లేదు.

మావెనుక జీపు ఆగి ఉంది. ఎత్తి దాంట్లో వేశాడు వాడు. సులోచన నా ప్రక్కనే కూర్చుంది. ఆ జీపు మీద ఇంగ్లీషులో 'పోలీస్' అని ఉంది. నన్నెందుకు పట్టుకున్నారు పోలీసులు? నా తప్పేమిటీ?

ఇనుప కటకటాల వెనుకకు త్రోసి తలుపు వేసి వెళ్ళిపోయాడు నన్ను పట్టుకున్నవాడు. జీపు నడుపుతూ వచ్చిన అధికార్ని చూసి సెల్యూట్ చేశాడు. ఆ అధికారి నన్ను పరీక్షగా చూశాడు. ఆరు అడుగుల పొడుగు ఉన్నాడు. నల్లటి జుట్టు. నల్లటి వంటి రంగు. నల్లటి వంటిరంగులో కనుపించే అరుదైన వ్యక్తి.

రెండు క్షణాలు నన్ను చూసి వెళ్ళిపోయాడు.

నీరసంగా నేలమీద చతికిల పడ్డాను.

చేతిగడియారంలో టైము చూసుకున్నాను.

తొమ్మిదిన్నర...రాత్రి!

×× ×× ××

మగతగా నిద్ర పడుతోంది. గుడ్డిగా వెలుగుతున్న దీప కాంతిలో టైము చూశాను. ఒంటి గంట. సులోచన ఏమైంది?

సులోచన ఆలోచన వెన్నులో చలి పుట్టించింది. సులోచన కూడా పోలీసు స్టేషనుకు వచ్చింది. సులోచన ఒంటరిగా...పరాయి దేశంలో... నా అన్న వారు లేని ప్రదేశంలో ఆమెకు భాష రాదు. నీరసంగా ఉన్న సులోచన...పోలీసులు...సులోచన...పోలీసు స్టేషన్లలో ఏం జరుగుతుందో? సులోచన లాంటి అందమైనది ఉంటే-నేను విన్నాను... పేపర్లలో చదివాను.

బలంగా ఉన్న ఇనుప ఊచలకు తల బాదుకుంటూ ఏడ్చాను-"సులోచనా ...సులోచనా" అని అరుస్తూ.

మెలకువ వచ్చేసరికి మర్నాడు తొమ్మిదయింది. డొక్కలు కడుపుకు అంటుకు పోయాయి. దాహంగా ఉంది. గస్తీ తిరుగుతున్న పోలీసును అడిగాను. వినిపించుకోనట్టు వెళ్ళిపోయాడు. రెండోసారి-"దాహం" అని గట్టిగా అరిచాను.

నోరు ఎండుకు పోతూ ఉంది.

మళ్ళీ నీళ్ళు అడిగాను. ఇవ్వలేదు. భయంవేసింది. చచ్చిపోతానేమో! జీపు నడిపిన అధికారి మధ్యాహ్నం వచ్చాడు. రెండు క్షణాలు చూసి వెళ్ళిపోతూ ఉంటే, "దాహం కావా"లని అడిగాను. అరిచాను. మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

ఆకలితో, దాహంతో సులోచన సంగతి మర్చిపోయాను.

మూడు గంటలకు మళ్ళీ వచ్చాడు. అరిచే ఓపిక లేక సంజ్ఞ చేశాను.

అయిదు గంటలకు మళ్ళీ వచ్చాడు.

నీళ్ళులేవు.

నీరసంగా నేల మీదికి వొరిగి పోయాను.

గంట గంటకి వచ్చి చూస్తున్నాడు.

ఎలా చస్తున్నానా అని చూస్తున్నాడా?

×× ×× ××

మొహంమీద చల్లటి నీళ్ళు తగిలిన స్పర్శతో మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచాను.

జీపు నడుపుకుంటూ వచ్చిన అధికారి సులోచనతో ఏదో అన్నాడు. తెల్లటి పలువరుస బయట పడేటట్టు నవ్వింది.

చల్లటి కూల్ డ్రింక్సు గ్లాసులో తెచ్చి పోశారు. రెండు గుక్కలు తాగిన తర్వాత ఎక్కిళ్ళు వచ్చాయి. మర్చిపోయిన దాహం తిరిగి వచ్చింది.

కమ్మని ఆ పానీయం గటగటా త్రాగేను.

టైము చూసుకున్నాను...తొమ్మిది నలభై రాత్రి.

×× ×× ××

జీపు కదిలింది. ముగ్గురం ఉన్నాం దాంట్లో. నేను, సులోచన, జీపు నడిపే ఆ పోలీస్. ఇరవై నిమిషాల తర్వాత జీపు ఆగిపోయింది.

"దుర్గా! వాళ్ళు వచ్చారు..." అరిచి చెప్పాడు, జీపు నడుపుకుంటూ వచ్చిన మనిషి.

నడివయస్సు దాటిన మనిషి బయటకు వచ్చింది.

"రండమ్మా! సులోచనా! అతన్ని కూడా తీసుకురా!" అంది నవ్వుతూ.

ఆశ్చర్యపోతూ లోపలకు వెళ్ళాను.

ఆ తర్వాత వేడినీళ్ళతో స్నానం. సాంబారు, పచ్చడి, పెరుగుతో భోజనం. చల్లటి వాతావరణంలో, మెత్తటి పక్కపై నిద్ర-కలలో లాగా జరిగి పోయాయి.

జాక్‌సన్ ఇన్ నుంచి మాసామాను తెచ్చివేసుకున్నాం. దారిలో సులోచన ఏంజరిగిందీ చెప్పింది.

జీపు నడిపిన వ్యక్తి పేరు చైతన్యమూర్తిట. సైకాలజీలో పి హెచ్. డి. చేసిన లెక్చరర్‌గా పనిచేశాడట ఉస్మానియా యూనివర్శిటీలో.

ఆస్ట్రేలియాలో హోమి సెడ్ వింగ్‌లో ఆఫీసర్‌గా ఉద్యోగం రావడంతో ఆస్ట్రేలియా వచ్చి స్థిరపడ్డాడు. సిడ్నీ నగర వీథులలో తెలుగు మాట వినపడడంతో, దారిన పోతున్న ఆయన ఆశ్చర్యపోయి ఆగిపోయాడుట. ఆ రాత్రి సులోచనను ఇంటికి తీసుకు వచ్చి భార్య దుర్గతో పరిచయం చేశాడుట.

"మరి, అన్నం నీళ్ళు లేకుండా నన్నెందుకు చంపాడు?" అన్న ప్రశ్నకు సులోచన గ్రుడ్లు తేలవేసింది.

చైతన్యమూర్తి వారం రోజులు సెలవు పెట్టాడు. ఇండియాకు మాప్రయాణం వాయిదా పడింది... రిజర్వేషన్సు కాన్సిల్ చేసుకున్నా.


ముప్పైఏడు వందల డెబ్బయి అడుగుల పొడవున్న హార్బర్ వంతెన, బట్టల పరిశ్రమలు. మెషినరీ పరిశ్రమ, ఉన్ని పరిశ్రమలు చూశాం.

రెండు రోజులు మెల్‌బోర్న్‌లో గడిపాం. సిడ్నీకి ఏడువందల ఇరవై నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది మెల్‌బోర్న్.

గవర్నమెంట్ హౌస్, కేతెడ్రిల్స్, మిచెల్ లైబ్రరీ, యూనివర్శిటీ ఆఫ్ సిడ్నీ, యూనివర్శిటీ ఆఫ్ న్యూ సౌత్‌వేల్స్, మేక్వారీ యూనివర్శిటీలు చూశాం.

బొటానికల్ గార్డెన్స్, పద్ధెనిమిది వందల ముప్పై ఆరు నాటి మ్యూజియం, బోటనీ 'బే' చూశాం.

పోర్టు జాక్‌సన్‌లో ఆయిల్ టాంకర్ నుండి




జరుగుతున్న ఎగుమతి, దిగుమతి చూశాం.

వారం రోజులు మాకు తెలియకుండానే గడిచిపోయాయి.

చైతన్యమూర్తి గారి వోల్క్‌స్వేగన్ నిర్విరామంగా ఊళ్ళన్నీ తిప్పింది. ఆయన భార్య దుర్గ గారు సులోచనను ఎంతో ఆప్యాయంగా చూసుకునేది.

చైతన్యమూర్తి ఇప్పుడింత ఆదరిస్తున్నాడు. మరి అప్పుడు నీళ్ళుకూడా ఇవ్వకుండా చంపాడే?

ఆ ప్రశ్నకు సమాధానం చివరకు దొరికింది.

×× ×× ××

సిడ్నీ ఎయిర్‌పోర్టులో చెకింగ్-ఇన్ పూర్తి చేసుకుని, సెక్యూరిటీ చెక్ కోసం కూర్చుని ఉన్నాం.

"ఆ రోజు అలా ప్రవర్తించినందుకు ఏమీ అనుకోకు, సుందరం! సిగరెట్టు పీకలు, పండ్ల తొక్కలు, చెత్తా చెదారం మన దేశంలో లాగా ఎక్కడపడితే అక్కడ వెయ్యకూడదు. తాంబూలం వేసుకుని రోడ్డుపైన ఉమ్మినా నేరమే! అటువంటి నేరాలకు జరిమానా అయిదు వందల అమెరికన్ డాలర్లు వరకు ఉంటుంది. వారం రోజుల నుండి నెల రోజుల వరకు జైలు ఉంటుంది..."

చైతన్యమూర్తి మాటలకు అడ్డువస్తూ అన్నాను నేను-"నేను ఫైను కట్టలేదు...జైలులో ఉండలేదు."

చైతన్యమూర్తి నవ్వి అన్నాడు-"జైలు శిక్ష అనుభవించావు. ఇక్కడ కోర్టులు మాకు కొన్ని అధికారాలు ఇచ్చాయి. కోర్టుకు వెళ్ళి శిక్ష వేసుకోవడం ఇష్టంలేని వాళ్ళకు మేమే శిక్ష వేయవచ్చు. వంద డాలర్లు ఫైను. అదికాక ఒక రోజు కఠిన కారాగార శిక్ష... అతి చిన్న శిక్ష... ఎక్కువ రోజులు జైలు శిక్ష అనుభవించదలచుకుంటే సామాన్య జైలు.

నిన్ను లాకప్‌లో వేసిన తర్వాత, మీ పరిస్థితి సులోచన ద్వారా విన్నాను. నాకున్న అధికారంతో మీకు తక్కువ శిక్ష వేశాను. కఠిన కారాగార శిక్ష నిజంగా కఠినంగా ఉంటుంది ఇక్కడ. రోజుకు ఒక్కసారి మాత్రమే ఆహారం, నీరు ఇచ్చేది. నీ ఒక్కరోజు శిక్ష పూర్తి కాగానే నువ్వు విడుదలయ్యావ్।"

ఎయిర్ పోర్టు లౌంజ్‌లో డిస్‌ప్లే బోర్డు 'ఎయిర్ ఇండియా ఫ్లైట్ టు మద్రాస్-రెడీ ఫర్ డిపార్చర్' అన్న గుర్తు చూపించింది.

దుర్గ,సులోచన ఒకరి నొకరు ఆప్యాయంగా కౌగలించుకున్నారు. తప్పకుండా ఉత్తరం వ్రాయండి లాటి మాటలు అయిన తర్వాత మేము లోపలకు వెళ్ళాం.

వెనక్కు తిరిగిన మాకు చైతన్యమూర్తి, దుర్గ కళ్ళు తుడుచుకోవడం కనుపించింది.

విమానం లెవల్ ఫ్లైట్‌కు వచ్చింది. 'ఫేసన్ సీట్ బెల్టు' లైట్లు ఆరిపోయాయి. ఎయిర్ హోస్టెస్ తాజా పానీయాలు ఇచ్చిన తర్వాత, సిగరెట్లు తీసుకు వచ్చింది ట్రేలో.

"వెధవ సిగరెట్టు. దీనివల్లే కదా ఇంత జరుగుత!" కోపంగా అంది సులోచన.

"అలా అనకు... ఇదే లేకపోతే మనం ఈ దేశం వచ్చేవాళ్ళమే కాదు. నేను సిగరెట్టు రోడ్డుమీద పడేయకపోతే, చైతన్యమూర్తి పరిచయం అయ్యేదా? మనం ఆస్ట్రేలియా చూడగలిగి ఉండేవాళ్ళమా!" అంటూ సిగరెట్టు వెలిగించాను.

విమానం మేఘాలను చీల్చుకుంటూ, పశ్చిమంగా దూసుకు పోతూ ఉంది. ★